# 11. సహజాతాలు

చదివిన బిటెక్ వ్యర్థమన్నట్టు ఛీత్కారం చేసింది.

కేంపస్ సెలక్షన్స్ లేవన్నప్పుడే 'చచ్చింది గొర్రె' అని జోక్ చేసుకున్నారు మిత్రులంతా. కాలేజీవారికి విద్యార్థుల మీది శ్రద్ధ అలా వుంది!

ఆలోచిస్తున్నాడు అరవింద్. అసహాయత, ఆందోళన, అలజడి! 'ఫ్రస్ట్రేషన్!'

కనిచీకటి పడింది. బయట ఈదరగాలి వీస్తోంది. వాన పడే సూచనలూ కమ్ముకొస్తున్నె. ఇంట్లోవాళ్ల గాలి తన మీదికి మళ్ళీ చాలా సేపయింది. ఏవేవో మాటలు... ఎన్నెన్నో వెతల క్రుమ్మరింపు, అన్నింటి సారాంశం ఒక్కటే.. బోలెడంత ఖర్చుపెట్టి చదివిస్తే, పనికిరాని డిగ్రీని తెచ్చుకున్నాడనే. రెండులక్షల అప్పు మిగిలింది. అమ్మ మాటల్లో – 'వడ్డీ కట్టలేక ఛస్తున్నాడు, అన్నయ్య అవధాని.'

ఇంటర్వ్యూలు! కాలేజీ ఫేకల్టీ ఎంత గొప్ప వర్తమానపు తెలివితో చదువు చెప్పారో అవగతం అవుతున్నె. పాత పనిముట్లతో కొత్త శిల్పాలేం నిర్మిస్తాం?! అయినా, ఉద్యోగాల వేట సాగుతోంది.

అభ్యర్థుల దగ్గరవున్న 'సరుక్కీ', కంపెనీలకి కావలసిన 'స్కిల్స్'కీ మధ్య పెద్ద అగాథం. దాన్ని పూడ్చటానికి మళ్లీ చిన్న చిన్న కోర్సులు. 'కోర్స్' అంటే ప్రవాహమే. ప్రవాహ మంటే అన్నయ్య చెమటచుక్కలు. కోర్స్ పేరు 'జావ'! సగం జావ తయారైన తర్వాత బోర్డ్ తిప్పేసింది ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్. అది వేరే గాథ. చరిత్ర!

దోసిట్లో నీళ్ళలా జారిపోయింది కాలం. డబ్బు – సరేసరి.

కంపెనీలకి ఇప్పుడు 'అనుభవం' కావాలి. కాకపోతే ఎంబిఏ వుండాలి. లేకపోతే, 'ఏడాదికో లక్ష సీటీసీ– ఓకేనా?' ప్రశ్న. చిటారుకొమ్మన మిఠాయిపొట్లం! దేశమంతా సాఫ్ట్‌వేర్ గురించీ, ఇంజనీరింగ్ గురించీ – బంగారు కలలు, రంగుల వలలు! వాస్తవంలో 'సగటు' మనిషి పరిస్థితి– ఇదీ.

చీకటిరాత్రులు ఎకసెక్కాలాడినై. గుండె గొంతుకలో కసి. పెదవుల మీద కోపపు శివతాండవం, రెటీనాని మండిస్తున్న భగ్నమైన ఆశలు.

మొన్న – 'అంతగా 'ఫ్రస్ట్రేట్' కాకు. దేనికైనా టైమ్ కలిసిరావాలి' అని పొరుగింటి పాతరచయిత తాతగారి హితబోధ. అంతకుముందు – రెండేళ్ళ క్రితం – 'క్యాట్‌కి ట్రై చెయ్యి, నువ్ తెలివిగలవాడివి' – వేణు ఆశాశ్వాస! 'యా. గుడ్ ఐడియా, బిటెక్ మార్క్‌లకీ దానికీ సంబంధం లేదు. గుడ్‌లక్'– సుమిత్ర శ్రావ్యంగా మీటిని ఆత్మవిశ్వాసపు వీణారవం! క్లాస్‌మేట్. సన్నిహితురాలు. ఇప్పుడు టిసిఎస్‌లో ఉద్యోగిని.

వెన్ను విరిగేటట్టు కూచుని చదివాడు. అప్పుడప్పుడూ – తెలివి గల ఘనుల్నీ, 'టైమ్' కోచింగ్‌లో వున్న ధనుల్నీ సంప్రతించాడు. సలహాలు తీసుకున్నాడు. వాళ్ళల్లో వేణూ ఒకడు. కుస్తీ పట్టాడు. ఫలితం – డెబ్భైరెండు పర్సంటెయిల్. ప్రవేశార్హతకి బహుదూరం. తొంభైవాడికే దిక్కులేదు. తెలివి తెల్లవారిందనే నిరాశ. కొంతమంది పరిచితుల హేళన. గరళాన్ని మింగాడు.

'ఇట్స్ వోన్లీ ఏ బెండ్, నాట్ ద ఎండ్ యార్., టేకేటర్న్' సుమిత్ర ఓదార్పు.

'కానీ చూద్దాం'. అన్నయ్య నీరసస్వనం. 'మ్యాట్' రాలేదు. 'గేట్' తెరవబడలేదు. 'పోనీ జీ.ఆర్.ఈ చూడు' సుమిత్ర హితోక్తి. పదహారు వందలకి తొమ్మిది వందల తొంభైలో ఆగింది మార్కు. చివరికి 'ఐసెట్' గట్టెక్కింది. పాసయ్యాడు. ఆ అర్హత మీద ఎంబిఏలో దిగాలి. రెండేళ్ళ చదువూ, రెండులక్షల కనీసఖర్చు. అవిగాక, తిండీ బట్టా ఎటూ తప్పవు. 'ఎడ్యుకేషన్‌లోన్'కి స్యూరిటీ కావాలి.

తిప్పి తిప్పి, కొట్టి కొట్టి, గొంగళిని అక్కడికే నెట్టింది కాలం. దిగులు కళ్ళతో చేతులెత్తాశాడు అన్నయ్య అవధాని. నాన్నపోయిన తర్వాత సంసార భారంతో సగమూ, పనిభారంతో మిగిలిన సగమూ వంగిన వెన్నెముకతో తిరిగే బడుగు బాపడు–మాస్టర్ కుక్!

'ఇంకా ఎన్నాళ్ళురా నీ చదువు?' అని ముక్కు చీదుకుంటుంది అమ్మ – దుర్గమ్మ. 'ఇదంతా నా ఖర్మ' అని ఎదుటివారిని తన నోటితో నెగ్గుకొస్తుంది వదిన సావిత్రి. ఇద్దరాడపిల్లల తల్లి. 'చేసింది పనికిరాని ఇంజనీరింగ్. అందులోనూ ఏభై అయిదు మార్కులు. కొన్ని కంపెనీలు మెట్లెక్కనీవసలు' అని ఈసడించే

విశాల. ఇంటర్‌పాసై కొరియర్ ఆఫీస్‌లో రెండువేలు సంపాయించే తెలివిగల పిల్ల చెల్లెలు!

ఇంట్లో ఏముంది? లేమి, అసహాయత, అనారోగ్యం, నిరాశ, అసంతృప్తి, నీరసం, ఆగ్రహం!

భోజనం మెతుకుల్నీ విసుగుల్నీ కెలికి, అయిందనిపించి పచార్లు చేయసాగాడు అరవింద్. వసారాని కొలుస్తున్నై కాళ్ళు. వాతావరణం ఉరుముతోంది. నిరుద్యోగిమీద దార్ష్టికం! లోపల వదిన ఏ విషయం మీదో అన్నయ్యని గద్దిస్తోంది. వివరమందటం లేదు.

సెల్ మోగింది. చూశాడు. సుమిత్ర. 'మా సామ్రాజ్యపు పొలిమేరల్లో వున్నా, బయల్దేరి వచ్చేస్తున్నా, కొలువైంది' అని 'గృహపార్లమెంటు తీర్మానాలేం విటి?' తన ధోరణిలో అడిగింది. ముక్కలూ... తుంపులూ.. మాటలు... చెప్పాడు. ఆమె నవ్వింది. 'రేస్ ప్రారంభం కాకుండానే నీ ఎంబిఏ గుఱ్ఱం కుంటుతోంది'. 'భేష్' అని కంఠస్వరాన్ని మార్చి 'ఓ.కె రేపు కలుద్దాం' అంటూ సెల్ ఆఫ్ చేసింది.

మరుక్షణంలో మళ్ళీ మోగింది సెల్. ఈ సారి వేణు.

'అరే.. అరవింద్, ఉన్న పళంగా రాంబాబు వాళ్లింటికి రా. అర్జంట్.' ఆందోళన, హడావిడి మాటల్లో చెదిరి పోతున్నై. 'అవున్రా రాంబాబు సూసైడ్ చేసుకున్నాడు."

గుండె దడదడలాడింది. స్కూటర్ తీశాడు.

– రాత్రికి రాత్రి, వానజోరులో, మిత్రులంతా కలిసి రాంబాబు శవాన్ని నడిపించారు! రాంబాబు తండ్రికి బాగానే 'ఖర్చ'యింది. ఆయనో చిన్న సైజు క్లాత్ మర్చంట్.

రాంబాబు మంచి స్నేహపాత్రుడు. ఏవరేజ్ మార్కులతో బిటెక్ అయింది. జాబ్ రాలేదు. నిరుత్సాహంలో కూరుకుపోయాడు. ఆరోగ్యం చెడింది. తీవ్రమైన డిప్రెషన్ అనుభవించాడు. ఫలితం – ఈ దుర్ఘటన.

అతని మరణం అందరి మనసుల్నీ కలిచివేసింది. వేణూ, అరవింద్ మరీ బాధపడ్డారు. బహుశ ఇద్దరూ నిరుద్యోగులు కావటం వల్ల కాబోలు! నలుగురూ నాలుగు విధాలుగా రాంబాబు ఆత్మహత్యని వ్యాఖ్యానించారు. "యూస్‌లెస్‌ఫెలో మరీ పెద్ద ఇంట్రోవర్ట్. మాట్లాడడు" అని ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేసింది సుమిత్ర.

నిద్రరాని రాత్రులు చాలా గడిచిపోయాయి.

❖ ❖ ❖

పగలు పది గంటలైంది.

మైత్రీవనం చౌరస్తాలో నిలబడి దిక్కులు చూస్తున్నాడు అరవింద్. పరిసరాలు పరమ కచరాగా ఉన్నై. కొన్ని పామ్ ప్లెట్స్. ట్రైనింగ్‌కి వేసే ఎర! కొన్ని ఉద్యోగాల్ని దోసిట్లో పోస్తున్నాం రమ్మన్నట్టు- హేండ్‌బిల్స్. డజన్ల కొద్దీ మొబైల్ నెంబర్లు! వందలకొద్దీ గాలాలు!

నిజంగా ఇన్ని ఉద్యోగాలున్నాయా? ఉంటే, 'యువత ఈ రోడ్లన్నీ ఇలా కొలవటమెందుకు?' 'అర్హతకు తగిన జాబ్ లేకపోవటమా?' 'ఆశించిన స్థాయి జీతం పలక్కపోవటమా?'

అరవింద్‌కి తలపుల తలపోటు తగిలింది. తల విదిలించుకుని అడుగు కదల్చబోయాడు.

ఎదురుగా సుమిత్ర! 'నీకెట్టా తెలుసు, నేనిక్కడున్నట్టు?' అరవింద్ ప్రశ్న. నవ్వింది. కళ్ళు చికిలించింది. 'నీ కేరాఫ్ అడ్రస్‌లన్నీ నా కెరికే కదా?' అంది.

పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో టీ!

జూబ్లీహిల్స్‌లో ఏదో పత్రికతో కలిసి కంపెనీల జాబ్ మేళా. వాకిన్ ఇంటర్వ్యూలు. వివరాలు చెప్పింది. 'బెస్టాఫ్ లక్!' 'నేను ఆఫీస్‌కి పోయొస్తా. నీ పని కానీ' అని వెళ్ళిపోయింది. అరవింద్ కూడా వేరే దిక్కుకు కాలు కదల్చాడు.

-ఇంటర్వ్యూలు సాగుతున్నై.

అరవింద్‌కి మొదటి రౌండ్ - 'ఫైన్'! రెండో రౌండ్- 'చూద్దాం'! మూడో రౌండ్- 'కష్టం, ఫంక్షనల్ నాలెడ్జ్ చాలా 'పూర్'గా వుంది. ప్లీజ్ యింప్రూవ్. బెటర్‌లక్ నెక్స్ట్ టైమ్'!

బయటికొచ్చేసరికీ - ఎదురుగా సుమిత్ర. చూశాడు. అరవింద్ న్యూనతా భావం అంతకుముందే ఆమెని తాకింది.

శాండ్‌విచ్, కాఫీ అయినై. బిల్లు ఆమెదే. అతని పరిస్థితినీ, మనసునీ పసిగట్టటంలో దిట్ట ఆమె. ఇందిరాపార్క్‌కి తీసుకొచ్చింది. కూచున్నారు. మూగనోములో పడ్డారు,

ఊపిరి తీసుకోవడం కూడా మరచినట్లు ఆలోచిస్తున్నాడు అరవింద్. ఆశ అనంతంలోకి జారుకుంది. మిగిలింది చీకటేనా? కనుచూపు మేర గోరంత వెలుగేమీ లేదు. ఇంజనీరింగ్. ఇంజనీరింగ్ .. ఎందుకు చేసినట్టు? కోచింగ్‌లూ... ఎమ్‌సెట్‌లూ.. కోర్స్‌లూ. నాలుగేళ్ళ కుస్తీపట్లు! ఆ తర్వాత? ఎవరో అన్నట్టు బతుకు బజారుపాలు! నిస్సత్తువగా వుంది. అసహనంగా వుంది.

సుమిత్రకేసి చూశాడు. పచ్చగా ఎత్తుగా గుబురుగా పెరిగిన చెట్లనీ, ఆ చెట్ల కుదుళ్ళలో ముడుచుకున్న యువజంటల్నీ చూస్తున్నట్లుంది! కానీ, చూపు నిలవటం లేదు. సిగ్గు పడుతోంది. చూపు మరల్చుకుని నగరకాలుష్యపు తెరలో మసిబారిన ఆకాశాన్ని చూస్తోంది. ఆమె వివరాలు స్ఫురించినై అరవింద్‌కి. సుమిత్ర తండ్రి – వ్యాపారస్థుడు, తల్లి టీచరు. ఈమె వాళ్లకి ఏకైక సంతానం. ఆయన చంద్రమౌళి. ఆమె పార్వతి. వాళ్ళతో మంచి పరిచయమే ఉంది. చాలాసార్లు ఆ యింట్లో బ్రేక్‌ఫాస్ట్‌లూ, భోజనాలూ కూడా అలవాటే. వాళ్ళకి అరవింద్ కుటుంబం స్థితి గతులు కూడా పూర్తిగా తెలుసు.

చాలా సమయం గడిచింది. తలవంచుకుని మొబైల్‌తో ఆడుకుంటూ, అప్పుడప్పుడూ తన హెయిర్ బాండ్‌ని సర్దుకుంటూ కూచుంది సుమిత్ర. ఆమెని పరికిస్తూ విషయాన్ని తానే ప్రస్తావించాడు అరవింద్. “రెండేళ్ళ టైమ్‌ని ఇన్‌వెస్ట్ చేసి అంతగా ప్రయోజనం వుండని లోకల్ ఎంబిఏని సంపాదించాలా అనే ప్రశ్న వేధిస్తోంది.”

ఆమె తలెత్తి అరవింద్ కళ్ళల్లోకి చూసింది. “దానికంటే ముందు డబ్బు సంగతి కదా మనల్ని వర్రీ చేస్తోంది” అన్నది.

అరవింద్ తడబడ్డాడు. నీళ్ళు నములుతూ ‘అవునవును’ అని నేల చూపులు చూశాడు. మాటలు తెమల్చుకుని “నిజానికి రెండూనూ” అన్నాడు. సుమిత్ర సన్నగా నవ్వింది. “చదువుకు పోతే ఆదాయం లేదు. చదవకపోతే ఆదాయం రాదు.... పిచ్చీ– పెళ్ళీ సామెతలా వుంది” అన్నది. సన్నగా నవ్వింది ఈ మాటలలతో వాతారణం తెరిపిన పడినట్లయింది. అరవింద్ కూడా సన్నగా నవ్వేడు.

ఇంతలో “హలో... ఏంవిటీ ఇక్కడ దిగబడ్డారు?” అంటూ వేణు ప్రత్యక్షమయ్యాడు. ఇద్దరూ విష్ చేశారు. లేచి నిలబడ్డారు. వేణు వెనగ్గా ఆ నలుగురూ వచ్చారు. “వీళ్లంతా ‘రక్షణ’ హాస్టల్‌మేట్స్. నా మిత్రులు” అని ఇటూ,

"వీళ్ళిద్దరూ అరవింద్ సుమిత్రా నా క్లాస్‌మేట్స్" అని అటూ పరిచయం చేశాడు. ఆ నలుగురూ తమ పేర్లు చెప్పుకుంటూ చేతులు కలిపారు.

మధు వో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో ఏజంటు. బిక్షాలు వో బిస్కెట్ కంపెనీలో సేల్స్‌మన్. సీతాపతి వో బిల్డర్ దగ్గర 'ఆయన చెప్పినవన్నీ చేస్తూ వుంటాడు'! వెంకటేశం వో ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎడ్మిన్ అసిస్టెంట్! 'అంతా చిరుద్యోగులు. అనేకానేక బాధాసర్పదష్టులు అని జోక్ చేశాడు వేణు. "అయిననూ నిరుద్యోగుల కంటే బెటరు" అని నవ్వింది సుమిత్ర. అరవింద్, వేణు- ఇద్దరూ నొచ్చుకున్నారు. ముఖకవళికలు మారినై. క్షణం తర్వాత "నో యిన్‌టెన్షన్స్, నో యిష్యూస్ అండ్ నో టెన్షన్స్. పదండి. చాయ్ సేవిద్దాం" అంటూ కదిలింది సుమిత్ర. ఆమె వైపు ఇప్పుడు మరీ పరీక్షగా చూశారు ఆ నలుగురూ. వేణూ, అరవింద్ అదేం గమనించలేదు.

అందరూ వచ్చి బుక్ ఎగ్జిబిషన్ లోపలికి ప్రవేశించారు. టీ అయింది. ఎవరికి వారుగా అక్కడక్కడ తచ్చాడారు. ఓ గంట గడిచింది. బయటికొచ్చేశారు. ఓ పక్కనున్న రెస్టారెంట్‌లో కూచున్నారు. ఛాట్, కాఫీలయినై. 'రక్షణ' గ్రూప్ తమ విషయాలేవో తాము మాట్లాడుకుంటున్నారు. ఆ టేబుల్ వాతావరణం ఆహ్లాదంగా, జాలీగా వుంది. ఇక్కడ మౌనం రాజ్యమేలుతోంది.

ఉన్నట్టుండి అరవింద్ మొహంవైపు చూస్తూ అడిగాడు వేణు, "నువ్వేం మాట్లాడవేరా?" అరవింద్ తలెత్తి అటూ ఇటూ చూసి 'ప్చ్' అని పెదవి విరిచాడు. "ఏంవిటీ, నీ వాలకం చూస్తే ఫ్రస్టేషన్, డిప్రెషన్, కంప్రెషన్ బాపతుగా తయారైంది" అని నవ్వాడు. ఆ వెంటనే తానేఅన్నాడు, "ఒరేయ్., పోయి పోయి రాంబాబు దారి పట్టేవురోయ్"! అని

సుమిత్ర గతుక్కుమంది. అరవింద్ వేణువైపు చురుగ్గా చూసి తలదించుకుని, పీలగా అన్నాడు, "నాకు వయస్సూ, కోరికలూ వున్నెరా. ఆనందం పట్లా, అనుభవం పట్లా ఆరాటమూ వుందిరా. ఏం ఫర్వాలేదు" అని "నాకు నిజంగా బతకాలనుందిరా" అన్నాడు. అతని స్వరం అప్పటికే బరువుగా అయింది. పక్కన కూచున్న సుమిత్ర చప్పున అతని చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కింది. బుజం మీద చేయివేసింది. తలవంచి అతని మొహాన్ని పైకెత్తింది. అరవింద్ కళ్ళనిండా నీళ్ళు!

వేణు పొరపాటున తానలాంటి జోక్ వేసినందుకు బాధపడ్డాడు. సారీ చెప్పాడు. సుమిత్ర తన సహజ ధోరణిలో 'నో ఎమోషన్స్ ప్లీజ్" అంటూ అరవింద్ కళ్ళల్లోకి చూసింది.

ఇంతలో 'రక్షణ' నలుగురూ వచ్చారు. "బిల్లు చెల్లింపబడెను. ఇక కదులుదమా" అంటూ నవ్వాడు సీతాపతి.

స్తంభించిన గాలి కొంచెం సడలింది. 'బై'లు చెప్పుకుని బయటకి కదిలారు.

అరవింద్‌ని తన వెహికల్ మీద విశ్వేశ్వరయ్య చౌరస్తాలో వదిలి, తాను అమీర్‌పేట వెళ్ళిపోయింది సుమిత్ర.

❖ ❖ ❖

బతుకు వెతలకు పురి పెడుతూ మరో వారం గడిచింది.

ఆవేళ – తెలతెలవారుతుండగానే ఫోన్ చేశాడు వేణు. "ఏమైనావ్ ఈ వారమల్లా కనపళ్ళేదు" అడిగాడు అరవింద్. "మా ఊరెళ్ళొచ్చా. అదిసరే. నీకో న్యూస్. నేనివ్వాళ ట్యూటోరియల్స్‌లో చేరుతున్నా. నెలకో ఎనిమిదివేలిస్తారు."

అరవింద్‌కి మాట రాలేదు. ఆ తర్వాత చాలా మాట్లాడి అన్నాడు వేణు, "చేతిలో పక్షి సామెత యార్..." అని!

అరవింద్‌కి నవ్వు రాలేదు. మేథలో ఆలోచన సుడి!

మరో గంట తర్వాత – సుమిత్ర ఫోన్ చేసింది. "ఇవ్వాళ రాత్రి డిన్నర్ మా యింట్లో చాలా యింపార్టెంట్. నో ఎస్కేప్" అంటూ ఫోన్ పెట్టేసింది. 'ఇది మామూలే ఆమెకి. ఇంట్లో కొత్త స్వీట్ చేయిస్తే పిలుస్తుంది. నాకు స్వీట్లంటే అమిత యిష్టమని తెలుసు తనకు' అని నవ్వుకున్నాడు.

ఆ రాత్రి – భోజనం సుమిత్రా వాళ్ళింట్లో. అరవింద్ అనుకున్నట్టుగానే ఘనంగా వుంది. స్వీటు – కుంకుమపువ్వు వేసిన ఖీర్.

భోజనం తర్వాత – హాల్లో కూర్చున్నారు. అప్పుడు చెప్పటం మొదలెట్టాడు చంద్రమౌళి. "మా గురించి నీకు బాగానే తెలుసు. అలాగే, నీ గురించీ మాకు పూర్తిగా తెలుసు. అందుకనే, నేనొక ప్రపోజల్ ఇస్తున్నాను. ఆలోచించి నీ నిర్ణయం చెప్పు" అని క్షణం ఆగి, గొంతు సవరించుకుని కొనసాగించాడు, "సుమిత్ర నిన్ను ప్రేమిస్తోంది. కులాల పట్టింపులేం లేవు మాకు. నీప్రస్తుత సమస్య చదువు, చదువుకో. ఎంబిఏ చెయ్. అది అవసరమే. అయితే ముందు మీరు పెళ్ళిచేసుకోండి. ఖర్చు సంగతి నా కొదిలెయ్. ఇంకో సంగతి. నీ చదువు కోసం మీ అన్నయ్య

చేసిన అప్పునీ మనం తీర్చేద్దాం. నీ చదువైన తర్వాత మన వ్యాపారాన్ని మనమే వృద్ధి చేసుకోవచ్చు. ఉద్యోగం వర్రీ కూడా అక్ఖర్లేదు" చెప్పటం ముగించి మనం "మళ్ళీ కలుద్దాం" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు చంద్రమౌళి. అరవింద్ మౌనశ్రోత అయ్యాడు.

ఆ తర్వాత పార్వతీ, సుమిత్రా ఆ విషయాలే మాట్లాడారు.

సుమిత్ర నవ్వుతూ "ఉద్యోగం చేసే భార్యా, నిరుద్యోగి భర్తా అంటూ ఆత్మన్యూనతలూ గట్రా నాటెలౌడ్" అన్నది. మెరుపు తీగలా చలించింది. అరవింద్ ఆలోచనల బరువు మోసుకుని బయటి కొస్తుంటే, "అమ్మాయ్ మనసునీ, పరిస్థితినీ అర్థం చేసుకున్న వాడివి. దాని ఆశల్ని కాదనకు" అన్నది పార్వతి.

బదులు మాట లేకుండా వచ్చేశాడు అరవింద్.

❖ ❖ ❖

అరవింద్ ఇల్లు చేరేసరికీ అర్థరాత్రి దాటింది.

మనసంతా గచ్చుపొదలా వుంది. పక్కమీద పడుకున్నాడు. అస్తిమితంగా మసలసాగేడు. ఏదో అలికిడైంది. లేచి ఆ వైపు చూశాడు. గోడవారగా, జారిగిలపడి, మూలగా... చీకట్లో .... అన్న అవధాని! అరవింద్ ఆయన దగ్గరసా వెళ్ళేడు. "ఏఁవిటన్నయ్యా- ఇక్కడ కూచున్నావ్?" అడిగాడు. ఆయన తలెత్తి తమ్ముణ్ణి చూశాడు. అన్న కళ్ళల్లో నీళ్ళు! అరవింద్ కలవరపడ్డాడు. నెమ్మదిగా అడిగాడు, "ఏమైందీ?"

పై పంచతో కళ్ళొత్తుకున్నాడు అవధాని. "ఏమీ కాలేదు రా, నీ చదువు సంగతే విచారం కలిగిస్తోంది. నీ భవిష్యత్తుకి నేనేవిధంగానూ సహాయపడలేని వాణ్ణయ్యాను" అనే సరికీ ఆయనకి దుఃఖం పొంగుకొచ్చింది. ఏడవసాగాడు.

అరవింద్ విచలితుడైనాడు. విచారం కలిగింది. "నువ్వేం చెయ్యకుండానే ఇంత వాణ్ణయ్యానా అన్నయ్యా! పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు. పద. వెళ్ళి పడుకో. చాలా పొద్దుపోయింది" అని ఆయన చేతిని పట్టుకుని లేవదీశాడు. తమ్ముడి మాట చల్లగా గుండెకి తగిలింది అవధానికి.

అన్నని నడిపించుకుంటూ ఆయన గది దాకా వెళ్ళాడు అరవింద్. ఆయన లోపలికి వెళ్ళగానే, తలుపుని విసురుగా మూసింది సావిత్రి! 'వదిన నిద్రపోలేదన్నమాట' అనుకున్నాడు అరవింద్. వచ్చి హాల్లో తన పడకన చేరాడు. ఆలోచనలతో మనసంతా అస్తవ్యస్తంగా వుంది. సెల్‌లో మెసేజ్ వచ్చింది. చూశాడు.

సుమిత్ర. 'నీరు నాకు స్ఫూర్తి కావాలి. ఏ స్థితినీ, గతినీ అయినా అనుసరించగలవు" సూక్తి! హితోక్తి!

ఆలోచిస్తుంటే వేణు గుర్తుకొచ్చాడు. అతని నిర్ణయం గుర్తుకొచ్చింది. అతని 'పక్షి' సామెత స్ఫురించింది. అంతకు ముందెప్పుడో అతను చేసిన హెచ్చరికా జ్ఞాపకం వచ్చింది. 'పోయిపోయి రాంబాబు దారి బట్టేవురోయ్!' 'రక్షణ' గ్రూపూ కళ్ళముందు మెదిలారు. చిరుద్యోగులు. బతుకులాలస చిత్రమైంది.

చంద్రమౌళి ప్రతిపాదన చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. సగటు మనిషి బతుకు తరుముతోంది. తెరువులు – శతకోటి!

సుమిత్రతో పెళ్ళికి అంగీకరిస్తే? సాధ్యమా? అమ్మ, అన్నయ్య... వదిన? చెల్లెలు.... ఆమె పెళ్ళి? ఆ సమస్యనలా పక్కన బెట్టినా – తాము భార్యాభర్తలుగా సంతోషంగా ఉండగలరా? భర్త అర్థం మారుతుంది కదా!

కూతురి ప్రేమకి ఇంత విలువనిచ్చే మనిషా చంద్రమౌళి ? కులాంతరమైనా రక్కున సరేననగలిగిన ఉదాత్తుడా? లేక వ్యాపారవేత్తగా వేరే ఆంతర్యమా? సుమిత్ర శారీరక సవాలు కారణమా?'అవసరమా? అవకాశమా? లేక రెండూనా?

రేపు తన నిర్ణయం ఏదైనా, దానికీ – ఇవే కారణాలవుతాయా? ఈనాటి దరిద్రానికి రేపటి వాస్తవమా ఇది? శత కోటి తెరువుల్లో ఇదీ ఒకటా? మనిషి వినిమయ వస్తువవుతున్నాడంటే ఇదేనా అర్థం..?

బుర్రలో ప్రశ్నలు గిరికీలు కొడుతున్నై అరవింద్‌కి. మగతగా వుంది. కలత నిద్రలా వుంది. కళ్ళు మూసుకున్నా ఎదుట సుమిత్ర ప్రత్యక్షమైంది. కళగల మొహం. ఆత్మవిశ్వాసాన్ని వర్షిస్తున్న కళ్ళు. చెరగని చిరునవ్వు. 'ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్. బట్ మెంటల్లీ స్ట్రాంగ్!' ఏదో కలవరింతలా వస్తోంది. 'మనల్ని మనం బజార్లో అమ్ముకునైనా మన కాళ్ళమీద మనం నిలబడటం ఉత్తమం' అన్నయ్య జీవన వేదాంతం!

అయితే, సుమిత్ర? సుమిత్రా కావాలి. అన్నయ్య హితవూ కావాలి! పక్కమీద మసలి అటు తిరిగాడు.

నవ్వుతూ చేయందిస్తున్నాడు – వేణు!

(నవ్య వారపత్రిక, జనవరి 1, 2014)